
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025

ప్రభుత్వ ఆసుపత్రిలో డైట్‌పై
విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ దాడులు
» నివేదికను అందించాలని సూపరింటెండెంట్‌ను కోరిన అధికారులు
» డైట్‌ను మహిళా సంఘాల ద్వారా నిర్వహించేలా చర్యలు 7

దాయాదుల మధ్య భూ తగాదా
- గాయపడిన భార్యాభర్తలు 7

సీజన్ ఉండగా..
ప్రాజెక్టుల పండగ

- జూరాల నుంచి మేలో దిగువకు నీటి విడుదల ఇదే మొదటిసారి..
- ప్రాజెక్టులో 9.65 టీఎంసీలకు గాను ఇప్పటికే 8.357 టీఎంసీల నిల్వ
- ముందస్తు వరదలతో శ్రీశైలం ప్రాజెక్టులో పెరుగుతున్న నీటి నిల్వలు
- ఎగువన ఆలమట్టికి పెరుగుతున్న వరద.. ప్రాజెక్టులో 51.13 టీఎంసీల నీరు
- నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల ద్వారా లిఫ్టింగ్ ప్రారంభం



నీటితో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

మహబూబ్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా జూన్ మూడో వారం నుంచి తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానది వరద ప్రారంభమవుతుంది. మొదట వచ్చే ప్రాజెక్టు జూరాల నుంచి జూన్ చివర లేదా జూలై మొదటి వారంలో శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తారు. కానీ ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని ముందుగానే తాకడం, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో జూరాల ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాలు కురవడంతో ఎగువ ప్రాజెక్టులకు కూడా మే నెలలోనే వరద ప్రారంభమైంది. దీంతో జూరాల నుంచి గురువారమే దిగువకు నీటిని విడుదల చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భారీగా వచ్చిన వరదను దిగువకు విడుదల చేయడంతో శ్రీశైలంలోనూ క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. డెడ్‌స్టోరేజీలో ఉన్న ప్రాజెక్టుల్లో మే నెలలోనే నీటినిల్వలు పెరుగుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే జూరాల ఆధారంగా ఉన్న నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం కాగా శ్రీశైలంలో నీటిమట్టం పెరుగుతుండటంతో మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కూడా మోటార్లను ప్రారంభించి నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. జూరాల నీటినిల్వ సామర్థ్యం 9.65 టీఎంసీలు కాగా ఇప్పటికే 8.537 టీఎంసీల నీరు నిల్వ చేశారు. గతేడాది ఇదే సమయానికి కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల నీటిమట్టాలతో పోల్చితే ఈ ఏడాది స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఆలమట్టి నుంచి మొదలుకొని భీమా నదిపై మహారాష్ట్రలో ఉన్న ఉజ్జయిని వరకు నీటినిల్వలు భారీగానే ఉన్నాయి.

వాటర్ ఇయర్‌లో 1,622 టీఎంసీల నీరు..

కృష్ణా బేసిన్‌లో అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న శ్రీశైలానికి ఈ వాటర్ ఇయర్‌లో 1622 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అంతకుముందు ఏడాది కేవలం 145 టీఎంసీల నీరు మాత్రమే రావడంతో ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలోకి వెళ్లింది. 2023 మినహా కృష్ణానదికి 2017 తర్వాత భారీగానే వరదలు నమోదయ్యాయి. దేశంలో జూన్ 1 నుంచి మే 31 వరకు వాటర్ ఇయర్‌గా పరిగణిస్తుండగా ఒక వాటర్ ఇయర్ పూర్తికాకుండానే ఇంతమొత్తంలో భారీ వరద రావడం, మే నెలలోనే జూరాల గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేయడం ఇదే మొదటిసారి అని చెప్పవచ్చు. శ్రీశైలానికి వెళ్లిన 1622 టీఎంసీల నీటిలో సింహభాగం 1100 టీఎంసీలకు పైగా జూరాల

(మిగతా 6లో..)

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల నీటి వివరాలు

ప్రాజెక్టు	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుతం (టీఎంసీలు)	గతేడాది నిల్వ ఇదే సమయానికి	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆలమట్టి	129.72	51.13	21.93	52786	6363
నారాయణపూర్	37.64	24.28	18.91	7098	181
ఉజ్జయిని	117.24	76.01	31.75	7625	343
జూరాల	9.65	8.53	3.74	25000	28062
తుంగభద్ర	105.79	15.16	3.32	17453	287
శ్రీశైలం	215.81	47.76	32.15	36740	2310
నాగార్జునసాగర్	312.05	135.78	122.85	10176	10176
పులిచింతల	45.77	25.29	0.42	0000	300

మత్స్యశాఖకు మకిలీ

- ఫిషరీస్ శాఖ జిల్లా ఉన్నతాధికారి, సొసైటీల మధ్య రగడ
- పరస్పర అవినీతి ఆరోపణలతో రచ్చకెక్కిన విభేదాలు
- విచారణకు సిద్ధమంటున్న ఏడీ
- ఆందోళన ఉధృతం చేసిన సొసైటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖలో అవినీతి జరుగుతోందని మత్స్యకార సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీలో ఫిషరీష్ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతే కాకుండా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. మునుముందు ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

- నాగర్‌కర్నూల్, ఆంధ్రజ్యోతి



ఏడీని బదిలీ చేయాలని వినతి పత్రం ఇస్తున్న మత్స్యకారులు (ఫైల్)

6

మట్టికి పరీక్షే?

- మట్టి నమూనా పరీక్ష చేయాలంటే జడ్చర్లకు వెళ్లాల్సిందే
- నాగర్‌కర్నూల్‌లో అందుబాటులో లేని భూసార పరీక్ష కేంద్రాలు
- వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నా నేటికీ అందని ఫలితాలు
- జిల్లాలోనే అందుబాటులోకి తేవాలంటున్న కర్షకులు

భూసార పరీక్ష అనేది నేల స్వభావం, రసాయన, భౌతిక, జీవ లక్షణాలను గుర్తించే ప్రక్రియ. ఇది నేల సారవంతమైన స్థితి, పోషక స్థాయిలు, పీహెచ్, మొక్కల పెరుగుదల, మొత్తం నేల లక్షణాలను నిర్ణయించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతోంది. ఈ పరీక్షలో భూమి స్థితిని బట్టి ఏ విత్తనాలు వేయాలి.. ఎరువులు ఎంత మోతాదులో వేయాలి. ఏ ఎరువులు వాడాలని అనే అంశాలు గుర్తిస్తారు. భూసార పరీక్ష ఫలితాల ప్రకారం రైతులు పంటలు సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. కానీ నాగర్‌కర్నూల్ జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేకపోవడంతో పాలమూరు జిల్లాలోని జడ్చర్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది మట్టి నమూనాలు జడ్చర్లలోని ల్యాబ్‌కు పంపినా నేటికీ ఫలితాలు రాలేదు. దీంతో వానాకాలంలో ఏ పంటలు వేయాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. జిల్లాలో భూసార పరీక్ష కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తే రైతులకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- నాగర్‌కర్నూల్ టౌన్, ఆంధ్రజ్యోతి

పాలమూరులో పర్యటించిన మిస్ వరల్డ్



మిస్ వరల్డ్‌గా ఎంపికైన థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ (ఎడమ నుంచి ఐదో మహిళ)

ఈ ఏడాది మిస్ వరల్డ్‌గా ఎంపికైన థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ గత నెల 17న పాలమూరులో పర్యటించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ఆమె ప్రపంచ సుందరిగా ఎంపికయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన వారిలో 22 మంది పిల్లలమర్రిని సందర్శించారు. ఆ సందర్భంగా ముద్దుగుమ్మలు ఫొటోకు ఇలా ఫోజిచ్చారు. వారిలో ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ కూడా ఉన్నారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

సారూ.. మీ కాళ్లు మొక్కుతా..
కలెక్టర్‌ను ధర్నా దగ్గరకు రప్పించండి

- విత్తనపత్తి రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని రోడ్డెక్కిన రైతులు
- కలెక్టరేట్ ముందు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మోకాళ్లపై ఆందోళన
- పెట్రోల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం
- విత్తనపత్తి రైతులకు న్యాయం చేసేదాకా ఉద్యమిస్తాం : రంజిత్‌కుమార్




గద్వాల కలెక్టరేట్ ముందు మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేస్తున్న రైతులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

గద్వాల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సారూ.... మీ కాళ్లు మొక్కుతా... కలెక్టర్‌ను మా ధర్నా దగ్గరకు రప్పించండి అని విత్తనపత్తి రైతులు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కాళ్లు మొక్కుతూ వేడుకున్నారు. తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ స్పందించాలని కోరారు. శనివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులు జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ముందు తమకు న్యాయం చేయాలంటూ మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేపట్టారు. ఆందోళనతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పోలీసులు, నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగి ఆ ప్రాంతమంతా ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. కలెక్టర్‌కు, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా చేసే ప్రదేశానికి కలెక్టర్ రావాలని, లేదంటే ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ఓ రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సందర్భంగా నడి గడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సీడ్ పత్తి రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, విత్తనపత్తి ప్యాకెట్‌పై రేట్లు పెంచి ఫెయిల్ అయిన విత్తనాలను రీ శాంపిల్ పెట్టాలని కోరారు. కంపెనీలు ఇచ్చే వాస్తవ ప్రయోజనాలను రైతులకు అందించకుండా మధ్యవర్తులుగా ఉన్న ఆర్గనైజర్లు దోపిడీ చేయడమే కాకుండా, రైతులకు అడ్వాన్స్‌పరంగా ఇచ్చే పెట్టుబడిని బాకీల ప్రకారం లెక్కకట్టి వడ్డీలు వసూలు చేయడంతో పాటు రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. విత్తనపత్తి ప్యాకెట్‌పై రేట్లు పెంచడంతో పాటు కంపెనీలు, ఆర్గనైజర్ల ద్వారా జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సకాలంలో రైతులకు మార్కెట్ రేట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగకపోతే త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం నిరసన చేస్తున్న ప్రదేశానికి డీఎస్పీ మొగులయ్య చేరుకొని సమస్యలను పరిష్కరించేలా చూస్తామని, అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యలను తెలపాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేయగా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనుమతి లేకుండా ధర్నా చేయడంతో రంజిత్‌కుమార్‌తో పాటు మరికొందరిపై కేసును నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, జమ్మన్న తదితరులు ఉన్నారు.

జూరాలకు పోటెత్తిన వరద

- తాగునీటి పథకాలకు తొలగిన ఇబ్బందులు
- ముందస్తు వరదతో గట్టెక్కిన నీటి సమస్య
- ఉమ్మడి జిల్లాలో 250 గ్రామాలకు తాగునీరు



అమరచింత వద్ద మిషన్ భగీరథ తాగునీటి పథకంలో ఫిల్టర్ అవుతున్న నీరు

అమరచింత, మే 31(ఆంధ్రజ్యోతి) : పక్షం రోజుల క్రితం తాగునీటి సమస్యను పరిష్క రించాలని రోడ్డెక్కిన ప్రజల సమస్యకు పరి ష్కారం లభించింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలోని తాగునీటి పథకాల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో 250 గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా అవుతోంది. ఈ గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు

జూరాల ప్రాజెక్టు చరిత్రలో 20 సంవత్సరాల రికార్డును మే నెలలో వచ్చిన వరద బ్రేక్ చేసిందని చెప్పవచ్చు. 15 రోజుల క్రితం ప్రాజెక్టులో నీటి నిల్వలు పూర్తిగా తగ్గి పోయి ఇసుక దిబ్బలు తేలాయి. ఆ సమయంలో ప్రాజెక్టు నీటి నిల్వల సామర్థ్యం పూర్తిగా 2.5 టీఎంసీలకు పడిపోవడంతో యాసంగి రైతులు, తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. సరిగ్గా 15 రోజులు గడవకముందే మే 29న అంచనాలకు మించి రికార్డు స్థాయిలో జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 7 టీఎంసీలకు పైగా నీటి నిల్వతో కళకళలాడుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు అధికారులు 12గేట్లు సైతం ఎత్తి దిగువకు వదిలారు. 20 ఏళ్లక్రితం ఎప్పుడో వచ్చిన వరద ప్రస్తుతం ఎండలు తీవ్రతరం ఉన్నా ఈ మే నెలలో రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. జూరాల ప్రాజెక్టు నుంచి వివిధ తాగునీటి పథకాల ద్వారా నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలోని దాదాపు 250 గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా చేయనున్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.



పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా? "అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

మట్టికి 'పరీక్షే'?


జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భూసార పరీక్ష కేంద్ర భవనం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సీజన్‌లో ఏప్రిల్, మే నెలల్లో భూములు ఖాళీగా ఉంటాయి. ఈ సమయంలో భూసార పరీక్షల కోసం వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారు. కానీ జిల్లాలో ఏడాది క్రితం వ్యవసాయ అధికారులు సేకరించిన భూసార పరీక్ష ఫలితాలు నేటికీ అందకపోవడంతో నేల స్వభావంపై రైతులకు అవగాహన కరువైంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నేల స్వభావాన్ని బట్టి ఏ పంటలు వేయాలో, దానికి అనుగుణమైన వేయాల్సిన ఎరువులపై రైతుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అందుబాటులో లేని పరీక్ష కేంద్రం

జిల్లాలో గత ఏడాది వా నాకాలంలో 4,35,692 ఎకరాలు, రబీలో 4,02,872 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు. కానీ పంట మార్పిడి పద్ధతులు అనుసరించేందుకు జిల్లా రైతాంగానికి దగ్గరలో ఏ ఒక్క భూసార పరీక్ష కేంద్రం కూడా అందుబాటులో లేదు. దీంతో భూసార పరీక్షలపై కొద్దో, గొప్పో అవగాహన కలిగిన రైతులు మట్టి పరీక్షలు చేయించాలంటే వ్యయ ప్రయాసాలకోర్చి దూర ప్రాంతంలో ఉన్న జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సిందే. ఇక్కడి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల వ్యవసాయ అధికారులే రైతుల నుంచి మట్టి నమూ నాలు సేకరించి జడ్చర్ల భూసార కేంద్రం వద్ద పరీక్ష లు చేయిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో వ్యవసాయ అధికారులు జిల్లాలోని పెంట్లవెల్లి మండలంలో దాదా పు 1400 మట్టి నమూనాలను సేకరించి జడ్చర్ల భూ సార పరీక్ష కేంద్రానికి పంపించినా వాటి ఫలితాలు నేటికీ అందలేదని వ్యవసాయ అధికారులు పేర్కొం టున్నారు. దీంతో రైతులు అ వగాహన రాహిత్యంతో మూస పద్ధతిలో పంటలు వేసి దిగుబడులు రాక న ష్టాలను చవి చూసే పరిస్థితి నెలకొంది.

నత్తనడకన భూసార పరీక్ష కేంద్రం నిర్మాణ పనులు

జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో భూసార పరీక్ష కేంద్రం ఏర్పా టుకు ప్రభుత్వం రూ.91 లక్షల నిధులతో భవనాన్ని నిర్మిస్తోంది. నిర్మాణం ప్రారంభించి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తున్నా నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి.

భవన నిర్మాణం పూర్తి చేసినా ల్యాబరేటరీలో పరీక్ష పరికరాలు, సిబ్బంది నియామకానికి మరిన్ని నిధులు కావాల్సి ఉంటుంది. దీంతో ఈ ఏడాది కూడా జి ల్లాలో భూసార పరీక్ష అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వానాకాలంలో జిల్లాలో దాదాపు 10 వేల మట్టిన మూనాలను సేవకరించి పరీక్షలు చేయించేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు చేస్తు న్నారు.

కానీ గత ఏడాది ఫలితాలే రాకపోవడంతో మరోసారి జిల్లా రైంతాంగానికి తిప్పలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న భూసార పరీక్ష కేంద్రం పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వచ్చి ఇక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ల్యాబ్ పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం



జిల్లా కేంద్రంలో భూసార పరీక్ష కేంద్రం భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ల్యాబరేటరీలో పరికరాల కోసం దాదాపు రూ.1.50 కోట్ల నిధులు ఖర్చవుతాయి. అదేవిధంగా ల్యాబ్‌లో సిబ్బందిని కూడా నియమించాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతానికి సేకరించిన మట్టి నమూనాలను జడ్చర్ల ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయించి భూసారాన్ని నిర్ధారించి తగిన పంటల మార్పిడికి రైతులను ప్రోత్స హిస్తున్నాం.

- చంద్రశేఖర్,
జిల్లా వ్యవసాయ అధికారి, నాగర్‌కర్నూల్

శనీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా తిల తైలాభిషేకాలు


నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): జేష్ఠాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


బిజినేపల్లిలో నిర్వహించిన దీక్షలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్

బిజినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చై ర్మన్ గంగనమోని కిరణ్, బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ప్రధాన రహదారి పక్కన బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు రిలే నిరాహార దీక్షలో శనివారం పాల్గొని మా ట్లాడారు. మహాత్మా పూలే, డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ సిద్ధాంతల ప్రకారం 2వేల సంవత్సరాలుగా కుల వివక్షతను అనుభవించిన బీసీలు విద్యకు దూరమై, అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమ సమాజ నిర్మాణం జరగాలంటే విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు స్థానిక, చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మండల బీసీ నాయకులు రాజేందర్ గౌడ్, ఇండ్ల శ్రీను, వెంకటస్వామి, సత్యశీలసాగర్, భగవంత్ గౌడ్, బాలలక్ష్మయ్య, ఊర్కొండ రఘుబాబు, అప్పాలి మనోహర్, అల్లోజీ, ఈర్ల చంద్రమౌళి, శ్రీని వాసులు తదితరులు ఉన్నారు.

పశువులను పట్టుకున్న పోలీసులు

- 68 పశువులు స్వాధీనం
- గోశాలకు తరలింపు


పోలీసులు పట్టుకున్న పశువులు

వెల్దండ, మే 31 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా హైదరాబాద్‌కు కంటైనర్‌లో తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు. ఈ సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కొట్ర గేట్ చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కొట్ర వద్ద పోలీసులు తనిఖీలలో భాగంగా హైదరాబాద్‌కు వెళుతున్న కంటైనర్‌ను తనిఖీ చేశారు. కంటైనర్‌లో 32 ఆవులు, 36 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పశువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు మండల పరిధిలోని కర్రెవానిపల్లి తండా సమీపంలోని గురునానక్ గోశాలకు తరలించారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన హుస్సేన్, కృష్ణ, సల్మాన్, తారీఫ్‌లపై కేసు నమోదు చేశారు. గోశాలకు తరలించిన పశువులకు పశువైద్యాధికారి శ్యాంసుందర్ వైద్యపరీక్షలు నిర్వహించారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థిని గడ్డిగోపుల పావని(18) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్లకు చెందిన పావని డిగ్రీ పరీక్ష రాసేందుకు నాగర్‌కర్నూల్‌కు వచ్చింది. పరీక్ష సమయాని కంటే అరగంట ముందే బయటకు వచ్చి వెళ్లిపోయింది. పరీక్ష అయిపోయే సమయానికి అమ్మాయి మేనమామ తాడూరు మండల కేంద్రానికి చెందిన తిరుపతయ్య పరీక్ష కేంద్రం దగ్గరికి వచ్చి చూడగా ఆమె కన్పించలేదు. తక్షణమే నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

మత్స్యశాఖకు మకిలీ

నాగర్‌కర్నూల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మత్స్యశాఖ అధికారులు, సొసైటీల మధ్య విభేదాలు రోజురోజుకు ముదిరిపోతున్నాయి. పరస్పర అవినీతి ఆరోపణలతో రచ్చకెక్కుతుండడం విమర్శలకు తావిస్తోంది. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమంటూ అధికారులు పేర్కొంటుండగా సొసైటీ సభ్యులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు, ఆందోళన చేస్తున్నారు. అవినీతికి కారణం మీరంటే మీరేనని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుండటంతో మత్స్యశాఖలో ఏం జరుగుతుందోనన్న అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

అంతులేని అవినీతి వాస్తవమేనా?

మత్స్యశాఖలో అంతులేని అవినీతి వాస్తవమేనా అనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. లక్షల రూపాయలు తిన్నారంటూ అధికారులు, సొసైటీలపై విమర్శలు వస్తుండడంతో ఇంత కథ ఉంటుందా అనే అంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 235 మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. ఇందులో 19వేల సభ్యత్వాలు ఉండగా 1,448 చెరువులు, కుంటలు, నాలుగు రిజర్వాయర్లల్లో చేప పిల్లలను ఉచితంగా వదులుతున్నారు. ఇక్కడే అసలు సమస్య ఉత్పన్నమవుతోంది. చెరువుల్లో చేప పిల్లలను వదిలే క్రమంలో వాటిని లెక్కించే ప్రామాణికత లేకపోవడం మత్స్యశాఖ అధికారులకు వరంగా మారిందని జిల్లా సొసైటీ అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు రాష్ట్ర ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో కోటి 53లక్షల చేప పిల్లలు చెరువుల్లో వదలాల్సి ఉండగా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై, కేవలం 30 లక్షల నుంచి 40లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారని ఆయన ఆరోపిస్తున్నారు. బొచ్చ, రవుట, మురగాల, బంగారుతీగ సంబంధించిన చేప పిల్లలు మూడించుల సైజులో నోటిఫైడ్ చెరువుల్లో వదలాల్సి ఉండగా మత్స్యశాఖ ఇందుకు భిన్నంగా వ్యవహరించిందని ఆయన ఆరోపిస్తున్నారు. కృష్ణానదిలో నాసిరకం చేప పిల్లలను వదలడానికి ప్రయత్నించగా వాటిని మంత్రి జూపల్లి కృష్ణారావు వెనక్కి పంపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఫిషరీస్ ఏడీ ఇందుకు కౌంటర్ ఇచ్చారు. సొసైటీల వారిగా ఏ చెరువులో ఎన్ని చేప పిల్లలను వదిలింది తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, నిర్దేశించిన సైజు లోపల ఉన్న చిన్న చేప పిల్లలను రిజక్ట్ చేసి కాంట్రాక్టర్లకు ఎలాంటి సొమ్ము చెల్లించలేదని ఆయన చెబుతున్నారు. అయితే సొసైటీ సభ్యులు మాత్రం చేప పిల్లల విషయంలో అవినీతి జరిగిందని, పాలెం పెంటోని చెరువులో లక్ష 30వేల చేప పిల్లలను వదలాల్సి ఉండగా కేవలం 30వేలకు పరిమితం చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు.

బీమా సొమ్ము చెల్లించడంలోనూ అక్రమాలు

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందించే విషయంలో కూడా అవినీతి జరిగిందని జిల్లా మత్స్యకార సొసైటీ ఆరోపిస్తుంది. మిట్టసదగోడు, వెన్నచెర్ల, తుమ్మల సూగుర్, నందివడ్డెమాన్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి అనేక కొర్రీలు పెట్టి 70నుంచి 80వేల రూపాయలు వసూలు చేసినట్లు సొసైటీ ఆరోపిస్తోంది. ఈ విషయాన్ని ఏడీ రజిని ఖండించారు. కొత్తగా సొసైటీల్లో చేరేవారు కేవలం రూ.55 రుసుము చెల్లించాల్సి ఉండగా జిల్లా మత్స్యకార సొసైటీకి చెందిన కార్యవర్గం రూ.3,500 వసూలు చేశారని కొత్త సొసైటీలను ఏర్పాటు చేయడానికి రూ.2లక్షలు డిమాండ్ చేసినట్లు ఉన్న ఆధారాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

మహిళా అధికారి అని వేధిస్తున్నారు..

సొసైటీ సభ్యులు చేస్తున్న అక్రమాలను ఎండగడుతున్నానని నన్ను వేధింపులకు గురి చేస్తున్నారు. సొసైటీ కార్యవర్గం నాపై చేస్తున్న ఆరోపణలన్నీ గతంలో ఏడీగా పని చేసిన అధికారి కాలంలో జరిగినవే. ఇందులో నా ప్రమేయం ఏమాత్రం లేదు. సొసైటీ అక్రమాలపై రాతపూర్వకంగా నేను ఉన్నతాధికారులకు తెలియజేశాను. ఎలాంటి విచారణకైనా సిద్ధమే..

- రజిని, ఫిషరీస్ ఏడీ

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎంజీకేఎల్‌ఐ కెనాల్‌లో చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని జొన్నలబొగుడ గ్రామ శివారులో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నలబొగుడ గ్రామానికి చెందిన పుట్టపాగ శివకుమార్(35)వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అయితే గ్రామ సమీపంలోని ఎంజీకేఎల్‌ఐ కెనాల్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తున నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనపై మృతుడి తల్లి పుట్టపాగ బురానమ్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వి.సతీష్ తెలిపారు. మృతుడికి భార్య పద్మ, ఒక కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

» ఒకరి మృతి, మరొకరికి గాయాలు

నారాయణపేటరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం నారాయణపేట మండలం చిన్నజట్రం స్టేజీ వద్ద చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి రోడ్డు నుంచి చిన్నజట్రం గ్రామంలోకి వెళ్తున్న ద్విచక్రవాహనం స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా మరికల్ నుంచి నారాయణపేటకు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న నర్సింహులు తలకు తీవ్ర గాయాలు కాగా పేట ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అలాగే భాస్కర్ అనే మరొక వ్యక్తికి స్వల్పగాయాలు కాగా, మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. విషయంపై కేసుచేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు రూరల్ ఎస్‌ఐ సి.రాముడు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

» ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం


ఫ్లైఓవర్‌పై అడ్డంగా ఉన్న లారీ

గద్వాల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): బండల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ఫ్లైఓవర్‌పై ఉన్న డివైడర్‌ను ఢీకొన్నది. అక్కడే గంటల తరబడి లారీ ఆగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలను దారిమళ్లించే సమయంలో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివవరాలిలా ఉన్నాయి. గుల్బర్గా నుంచి బండల లోడ్‌లో హెవీ లారీ రాయచూర్‌కు వెళ్లాల్సి ఉంది. శుక్రవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా లారీ పెద్దదిగా ఉండటం, డ్రైవర్ సరిగా కట్ చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో లారీకి సంబంధించిన కొన్ని భాగాలు ఊడిపోవడంతో కదలలేక అలాగే ఉండిపోయింది. ఈ సంఘటనలో లారీ అలాగే ఉండటంతో అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ పోలీసులు దారిని మరల్చి రెండవ రైల్వేగేట్ గుండా వాహనాలను పంపించారు. శనివారం మధ్యాహ్నం వరకు ఈ సమస్య అలాగే ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

హన్వాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన మునిమోక్షం వెంకట్‌రెడ్డి (65) అనే వ్యక్తి శనివారం సాయంత్రం సమయంలో టీవీఎస్ మోపెడ్‌పై పొలానికి వెళ్తున్నాడు. ఇబ్రహీంబాద్ గ్రామ సమీపంలో కోస్గి నుంచి అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టడంతో వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు.

మరో సమరానికి సన్నద్ధం

● రేపటి నుంచి హెచ్‌సీఏ అంతర్ జిల్లా వన్ డే క్రికెట్ టోర్నీ


అండర్-23 2డే లీగ్ టోర్నీలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్(ఫైల్)

» తలపడనున్న 6 జట్లు

» ప్రతిభ కనబరిస్తే ఉమ్మడి జట్టుకు..

» టోర్నీని ప్రారంభించనున్న ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు హెచ్‌సీఏ అంతర్ జిల్లా అండర్-19 వన్ డే క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. 2డే లీగ్ టోర్నీ ముగిసింది. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్ ప్రతిభ చాటారు. ఇటీవలే జరిగిన ఉమ్మడి జిల్లా ఎంపికల్లో 70 మంది క్రీడాకారులను సెలెక్ట్ చేసి 6 జట్లుగా విభజించారు. పూల్-ఏలో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, పూల్-బీలో మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జట్లు ఉన్నాయి. 50 ఓవర్ల మ్యాచ్‌లు, ఒక్కో జట్టు 5 మ్యాచ్‌లు ఆడుతాయి. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టుకు ఎంపిక చేసారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటుంది.

టోర్నీలో ప్రతిభ చాటాలి.....



అంతర్ జిల్లా అండర్-19 వన్ క్రికెట్ టోర్నీని ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. 50 ఓవర్ల మ్యాచ్‌లు ఉంటాయి. 2డే టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ చాటారు. వన్ డే టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి. ప్రతిభ కనబరిచి క్రీడాకారులను రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టులో చోటు లభిస్తుంది. టోర్నీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎం.రాజశేఖర్, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి

అండర్-19 వన్ డే లీగ్ మ్యాచ్‌ల వివరాలు ఇలా...

తేదీ	తలబడే జట్లు	వేదిక
జూన్ 2	మహబూబ్‌నగర్-జడ్చర్ల	మహబూబ్‌నగర్
	జడ్చర్ల-గద్వాల	జడ్చర్ల
	నారాయణపేట-నాగర్‌కర్నూల్	నారాయణపేట
జూన్ 3	నాగర్‌కర్నూల్-మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్
	గద్వాల-వనపర్తి	వనపర్తి
	జడ్చర్ల-నారాయణపేట	జడ్చర్ల
జూన్ 4	మహబూబ్‌నగర్-గద్వాల	మహబూబ్‌నగర్
	నాగర్‌కర్నూల్-జడ్చర	జడ్చర్ల
	వనపర్తి-నారాయణపేట	వనపర్తి
జూన్ 5	మహబూబ్‌నగర్-నారాయణపేట	మహబూబ్‌నగర్
	జడ్చర్ల-వనపర్తి	జడ్చర్ల
	గద్వాల-నాగర్‌కర్నూల్	గద్వాల
జూన్ 6	జడ్చర్ల-మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్
	నాగర్‌కర్నూల్-వనపర్తి	నాగర్‌కర్నూల్
	నారాయణపేట-గద్వాల	గద్వాల


ఉమ్మడి జిల్లా టోర్నీకి ఎంపికైన అండర్-19 ఎండీసీఏ జట్టు

దాయాదుల మధ్య భూ తగాదా

» ఘర్షణలో గొడ్డలి తగలడంతో భార్యాభర్తలకు గాయాలు

తాడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో కొన్నేళ్లుగా దాయాదుల మధ్య భూ తగాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి అతని భార్య తిరుపతమ్మ కలిసి పొలానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి మధ్యన గొడవ జరిగింది. ఒకరినొకరు తోసుకుంటున్న క్రమంలో జైపాల్‌రెడ్డి వద్ద ఉన్న గొడ్డలిని కృష్ణారెడ్డి తీసుకుని దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో జైపాల్‌రెడ్డి అతని భార్య తిరుపతమ్మకు గాయాలు కావడంతో వారిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గురుస్వామిని వివరణ కోరగా, ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిసిందని.. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. అయినప్పటికీ గాయాలపాలైన జైపాల్‌రెడ్డి, తిరుపతమ్మలు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండటంతో అక్కడికి సిబ్బందిని పంపించి జరిగిన ఘటనపై బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో
డైట్‌పై విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ దాడులు

» నివేదికను అందించాలని సూపరింటెండెంట్‌ను కోరిన అధికారులు

» డైట్‌ను మహిళా సంఘాల ద్వారా నిర్వహించేలా చర్యలు

గద్వాల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు డైట్(పేషెంట్స్‌కు అందించే ఫుడ్)కు సంబంధించి దాడులు నిర్వహించినట్లు శనివారం తెలిసింది. అయితే గత కొంతకాలంగా ఆసుపత్రిలో డైట్‌కు సంబంధించి రోగులకు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, అంతేకాకుండా మెనూ ప్రకారం ఆహారపదార్థాలను అందించడంలేదని ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి రోగులను విచారించారు. అయితే తమకు ఫిర్యాదు అందిన విషయం స రైందని నిర్ధారించుకొని సంబంధిత డైట్ కాంట్రాక్టర్‌కు సంబంధించిన గడువు వరకు ఉంచాలని, తర్వాత ఆ కాంట్రాక్ట్‌ను మహిళా సంఘాలకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై వివరణ ఇవ్వాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరను విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కోరారు. ఈ మేరకు వివరణ ఇచ్చినట్లు ఆమె 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అలాగే ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను కలెక్టర్ బీ ఎం సంతోష్‌కు కూడా సమర్పించినట్లు తెలి పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి నిర్ణ యం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న డైట్ కాంట్రాక్టర్ గడువు 2025, జూన్ 26 వరకు ఉందని, తర్వాత మహిళా సంఘాల ద్వారా డైట్ నిర్వహించేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, డైట్ క్రాంటాక్ట్ విషయంలో దాడులు చేప ట్టిన విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆసు పత్రిలోని ముగ్గురు వైద్య సిబ్బందికి మె మోలు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే, జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో కూడా ఈ కాంట్రాక్టరే డైట్ నిర్వహిస్తుండటంతో అక్కడ కూడా విద్యార్థులు ఇటీ వల ఆహార పదార్థాలు నాణ్యత లేవని మెడి కల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ కూడా ఇతరులకు డైట్ కాంట్రాక్ట్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

పీయూ జవాబు పత్రం లీకేజీపై త్రిసభ్య కమిటీ

మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నన్ను ఎలాగైనా పాస్ చేయండి సార్.. మీకు దండం పెడతా.. అనే జవాబు పత్రంలో ఓ విద్యార్థిని రాసిన సమాచారాన్ని బయటకు సోషల్ మీడియాలో పెట్టి లీక్ చేసిన అతనిపై పాలమూరు యూనివర్సిటీ అధికారులు త్రిసభ్య కమీటీ వేశారు. ఈ కమిటీ నిర్ణయం మేరకు పేపర్ లీకేజీ అయిన వారిని గుర్తించి అతనికి పేపర్ మూల్యాంకనానికి ఎప్పుడూ అవకాశం కల్పించకూడదని, ఇతర పీయూ విద్యావ్యవస్థకు సంబంధించిన నియామకాలలో ఎలాంటి అవకాశాలు ఇవ్వరాదని అధికారులు శనివారం నిర్ణయం తీసుకున్నారు. త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించనున్న 3 ఇన్ త్రీ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం నిర్వహించనున్నారు. ఇండోర్ స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ జాకేర్, నస్రూల్లా హైదర్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని కోరారు.

సకాలంలో యూనిఫాంలను అందించాలి


శేకుపల్లి గ్రామంలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్థాయి సెర్ప్ డైరెక్టర్ శ్రీజాన్సన్

ఎర్రవల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరుచుకునే నాటికి సకాలంలో విద్యార్థులకు యూనిఫాం (దుస్తులు)ను అందించాలని రాష్ట్ర సెర్ప్ నాన్ ఫామ్ డైరెక్టర్ శ్రీజాన్సన్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు కేంద్రాన్ని శేకుపల్లి గ్రామంలో శనివారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన కుట్టుతో సకాలంలో పాఠశాల ఏకరూప దుస్తులు అందించాలని టైలర్లకు సూచించారు. ఈ దిశగా జిల్లా స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు కుట్టు కేంద్రాలపై దృష్టి సారించి విద్యార్థులకు పాఠశాల ప్రారంభమయ్యే నాటికి అందేందుకు తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు, డీపీఎం రామ్మూర్తి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కురుమయ్య, సీసీలు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

పేట-కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణకు రీ సర్వే


బాపన్‌పల్లిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

దామరగిద్ద, మే 31 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మహ్మద్‌జమీల్ అన్నారు. ఆయనతో పాటు శనివారం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో భాగంగా మండలంలోని దామరగిద్ద, దామరగిద్దతండా, బాపన్‌పల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో అధికారులు, సర్వే బృందం మళ్లీ రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.40లక్షల నుంచి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐలు బాలరాజ్, రమణ, ఫారెస్టు అధికారులు, పోలీసు సిబ్బంది, సర్వే బృందం ఉన్నారు.

సీజన్ ఉండగా ప్రాజెక్టుల పండగ

(5వ పేజీ తరువాయి)

నుంచి వెళ్లిందే. గతేడాది కృష్ణానదికి వరద తగ్గినా భీమా నది నుంచి వరద పెరగడంతో ఇంత భారీ సాయి వరద నమోదైంది. ముందస్తుగా కురిసిన వర్షాలతో ఇప్పటికే రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని పత్తి విత్తనాలు నాటుతుండగా వరి సాగుకు కూడా రైతులు సమాయత్తం అవుతున్నారు. వరద వస్తున్న రోజుల్లోనే వానాకాలం వరి కోతకు వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం జూరాల ఆధారంగా కేవలం నెట్టెంపాడు ఎత్తిపోతలకు మాత్రమే నీటిని విడుదల చేస్తుండగా భీమా, కోయిల్‌సాగర్ లిఫ్టులను ఇంకా ప్రారంభించలేదు. త్వరితగతిన పంపింగ్ ప్రారంభిస్తే ఎక్కువ నీటిని స్టోర్ చేసుకునే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఆయకట్టు పరిధిలోని నారుమళ్లకు కూడా నీటి విడుదలను ఇంకా ప్రారంభించలేదు. రైతులు ఇంకా నారుమళ్ల సాగు ప్రారంభించకపోవడంతోనే ఆయకట్టులోని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయడం లేదని తెలుస్తోంది. అయితే కాలువల ఆన్‌లైన్‌లో ఉన్న చెరువులను ముందస్తుగా నింపుకునే అవకాశం మాత్రం ఉంది.

సమృద్ధిగానే వరద...

గతేడాదితో పోలిస్తే ఎగువన ఉన్న ఆలమట్టి రిజర్వాయర్‌కు కూడా త్వరగానే వరద ప్రారంభమైంది. గతేడాది ఇదే సమయానికి ఆలమట్టి ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలో ఉన్నది. 129.72 టీఎంసీలకు గాను.. 21.93 టీఎంసీల నీరు మాత్రమే ఆ ఏడాది నిల్వ ఉన్నది. కానీ ప్రస్తుతం వాటర్ ఈయర్ పూర్తయ్యేనాటికే 51.13 టీఎంసీలకు నీటినిల్వలు చేరాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో 52,786 క్యూసెక్కుల వరద నమోదవుతోంది. ఎగువన వర్షాలు ఇలాగే కొనసాగితే జూన్ రెండోవారంలోపే దిగువకు నీటి విడుదల ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. నారాయణపూర్ రిజర్వాయర్‌లో 37.64 టీఎంసీలకు గాను 24.28 టీఎంసీల నీరు ఇప్పటికే నిల్వ ఉన్నది. వరద ప్రారంభమయ్యేలోపే పరివాహకంలో కురిసే వర్షాలకు ఫుల్ స్టోరేజీకి రిజర్వాయర్ చేరనుంది. గతేడాది ఇదే సమయానికి నారాయణపూర్‌లో 18.91 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నది. భీమా నదిపై ఉన్న ఉజ్జయిని నిండి దిగువకు నీటి విడుదల ప్రారంభం కావడానికి కనీసం ఆగస్టు నెలదాక సమయం పడుతుంది. కానీ ఈసారి అందులో కూడా 117.24 టీఎంసీలకు గాను 76.01 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. గతేడాది ఇదే సమయానికి ఉజ్జయినిలో నీటినిల్వ 31.75 మాత్రమే. దాదాపు రెట్టింపు నీటి లభ్యత ఇప్పటికే ఉన్నది. వర్షం సమృద్ధిగానే వచ్చే అవకాశం ఉండటంతో ఎక్కువ నీటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రణాళికలు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.


నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల మోటార్లను ప్రారంభిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (ఫైల్)

వరద ప్రవాహం

» శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వస్తున్న నీరు

» కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

» డ్యాంలోకి చేరుతున్న 36 వేలకుపైగా క్యూసెక్కుల నీరు

» వారం రోజుల్లో శ్రీశైలం డ్యాంకు చేరిన 10 టీఎంసీల వరద


శ్రీశైలం జలాశయంలో నిల్వ నీరు


సుంకేసుల డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

దోమలపెంట/ఆత్మకూరు/రాజోలి, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు రోజురోజుకు కృష్ణా పరివాహక ప్రాంతం నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఎగువన ఉన్న సుంకేసుల నుంచి 4,345 క్యూసెక్కులు, జూరాల ప్రాజెక్టు గేట్లు మూసివేయగా, విద్యుత్ ఉత్పాదనతో 26,817 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మొత్తంగా 31,162 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాం వైపునకు వస్తుండగా, 36,740 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్నది. ఎంజీకేఎల్‌ఐ కాల్వ ద్వారా 416 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. దీంతో శనివారం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను, 828.20 అడుగులకు చేరింది. 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 47.7648 టీఎంసీల నీటి నిల్వలు నమోదు అవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 1,095 క్యూసెక్కుల నీటితో 0.484 మిలియన్ యూనిట్లు, కుడి గట్టు కేంద్రంలో 638 క్యూసెక్కులు నీటిని వినియోగించి 0.291 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పాదన చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం నిల్వ నీటి నుంచి 2,310 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో కొనసాగుతున్నదని శనివారం డ్యాం అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఎగువ నుంచి వరద కొనసాగుతున్న కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. శనివారం సాయంత్రం నాటికి ఎగువ జూరాలలో నాలుగు యూనిట్ల ద్వారా 2.338 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కొనసాగించినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ప్రారంభించి 2.284 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది గత ఏడాది కంటే ముందుగానే వరద వచ్చిన కారణంగా ముందుగానే ఉత్పత్తిని ప్రారంభించినట్లు తెలిపారు.

సుంకేసులకు..

రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. శనివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,500 క్యూసెక్కులు వరద నీరు వస్తుండటంతో ఒక గేటు ద్వారా 4,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు సుంకేసుల ప్రాజెక్టు జేఈ రాజు తెలిపారు.

సుంకేసుల డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 291.60 మీటర్లుగా నమోదైంది. నీటి నిల్వ 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 1.068 టీఎంసీ నీరు ఉందని అధికారులు తెలిపారు.

ఇంటర్వ్యూ..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- దీప్తి, వ్యవసాయ అధికారి, ఊర్కొండ



ఊర్కొండ, మే 31 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టాల ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి దీప్తి అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా ?

నకిలీ విత్తనాలపై వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటిస్తూ రైతులకు నకిలీ విత్తనాలు వాడటం వల్ల కలిగే అనర్థాలు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నాము.

సీడ్స్, పెస్టిసైడ్స్ దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారా ?

స్థానిక పోలీసులతో కలిసి సీడ్స్ దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాము. అనుమతులు లేకుండా పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. సీడ్స్ దుకాణాలలో విత్తన స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, స్టాక్ వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని, రైతులకు విత్తనాలు విక్రయించినప్పుడు వారికి తప్పకుండా రశీదు ఇవ్వాలని, ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలని డీలర్లకు వివరించాము.

రైతులకు ఏమైనా సూచనలు చేస్తారా ?

రైతులు వేసవి దుక్కులు దున్నాలి. అలా చేసుకోవడం వల్ల పంటల దిగుబడి పెరిగి, చీడపీడలను నివారిస్తుంది. అంతేకాకుండా భూమిలో తేమ నిల్వ శాతం పెరుగుతుంది.

న్యూస్ బాక్స్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల, మే 31 (ఆంధ్రజ్యోతి) : జూన్ 3 తేదీ నుంచి 17 వరకు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3న పెనిమిళ్ల, ఉప్పరిపల్లి, 4న తిప్పాపూర్, లత్తీపూర్, 5న కొరటికల్, జప్తిసదగోడు, 6న రాజనగర్, ఉప్పునుంతల, 9న వెల్టూరు, మర్రిపల్లి, 10న మామిళ్లపల్లి, విఘ్నేశ్వర్‌పూర్, 11, తాడురు, మొల్గర, 12న పెద్దాపూర్, తిప్పాపూర్, 13న అయ్యవారిపల్లి, దాసర్లపల్లి, 16న లక్మాపూర్, పిర్వాటోనిపల్లి, 17న రాయిచెడి, కంసానిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యుడిగా దాస్

కొల్లాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామానికి చెందిన బి.దాస్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది బోనాసి రామచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్ననాటి నుంచే బీఎస్పీ సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ విస్మరించదన్నారు. బి.దాస్ మాట్లాడుతూ కొల్లాపూర్ మండలంలో మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తామని అన్నారు. బీఎస్పీ అభ్యర్థులను గెలిపించి మండలంలో పార్టీ జెండా ఎగురవేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎన్ఎస్‌యూఐ

తిమ్మాజిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎన్ఎస్‌యూఐ మండల శాఖ అధ్యక్షుడు సిద్దు బహదూర్ అన్నారు. తిమ్మాజిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం నాటికి ప్రతీ విద్యార్థికి ఉచితంగా అందించే యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయడానికి సిద్ధంగా ఉంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య లభిస్తుందని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులనిచే విద్యాబోధన ఉంటుందని ఎన్ఎస్‌యూఐ తరఫున తాము గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

గురుకుల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కల్వకుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ విద్యార్థులను బాత్‌రూమ్‌లు కడగాలని, మరుగుదొడ్లు శుభ్రపర్చాలని మాట్లాడిన ఎస్సీ గురుకులాల సెక్రటరీ వర్షిణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రామార్జున్ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐఏఎస్ అధికారి అయి ఉండి దళిత విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాల్సింది పోయి ఇలాంటి మాటలు మాట్లాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జమాలుద్దీన్, నాయకులు శివప్రసాద్, రాజు, శివ, సంతోష్, జయకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

- కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన తహసీల్దార్ శ్రీరాములు ఉద్యోగ విరమణ వీడ్కోలుకు హాజరై మాట్లాడారు. అంతకుముందు తహసీల్దారు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించా రు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అమరేందర్, ఆర్డీవో సురేష్, విశ్రాంత స్పెషల్ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు, కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, డీలర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులు కళల్లో ప్రావీణ్యం సాధించాలి

కొల్లాపూర్ : విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా వివిధ కళల్లో ప్రావీణ్యం సాధించి జానపద, శాస్త్రీయ నృత్యాల్లో విద్యార్థులు రాణించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, కొల్లా పూర్ ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్, రత్నగిరి ఫౌండే షన్ కన్వీనర్ ధర్మతేజ ఉన్నారు.

● సిమెంట్, మట్టి ఇటుకల తయారీ యూనిట్లతో తక్కువ పెట్టుబడితో నిర్వాహకులకు నిలకడైన ఆదాయం దక్కుతుందని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం కొల్లాపూర్ సమీపంలోని సిమెంట్, మట్టి ఇటుకల తయారీ యూనిట్లను కలెక్టర్ పరిశీలించి ఇటుకల యూనిట్ల ద్వారా వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెద్దకొత్తపల్లి : ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, వర్షాలు రాక ముందే ధాన్యం తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని కల్వకోల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.అమరేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి నరసింహారావు, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పదవీ విరమణ పొందిన తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పొగాకుకు దూరంగా ఉండి... ఆరోగ్యంగా జీవించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి
- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన ర్యాలీ

కందనూలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు దూరంగా ఉండండి ఆరోగ్యంగా జీవించండని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణం ఆవరణలో డీఎంహెచ్‌వో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది అందరిచే పొగాకు ఉత్పత్తులు వినియోగించనని, స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులందరికీ పొగాకు ఉత్పత్తులు వినియోగించకుండా అవగాహన కలిగిస్తానని పొగాకు ఉత్పత్తుల వాడకం నుండి పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. పొగతాగడం, పొగాకు ఉత్పత్తులైన గుట్కా, ఖైని, తంబాకు, జర్దా వంటి ఉత్పత్తులను వినియోగించడం వలన శరీరంలో రక్తనాళాలు, మెదడు, గుండె, జీర్ణ వ్యవస్థ తదితర అవయవాలపై దుష్ప్రభావం కలుగుతుందన్నారు. క్రమంగా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కృష్ణమోహన్, టీకీకరణ అధికారి డాక్టర్ రవికుమార్, పెద్దముద్దునూ ర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి, ఎన్‌సీడీ నోడల్ పర్సన్ విజ య్‌కుమార్, మల్లేష్, ఎంఎల్‌హెచ్ పీలు నీరజ్, పర్యవేక్షణ సిబ్బంది ఆర్.శ్రీనివా సులు, రాజేష్, వై.శ్రీని వాసులు, ఫసియోద్దీన్, జ్యోతి, జిల్లా ఫార్మసీ ఆఫీసర్ సురేష్, డీవీ ఎల్ఎం. కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఇన్‌చార్జి సెక్రటరీ ఎన్.వెంకటరామ్ శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం కార్యక్రమం నిర్వహించారు. పొగాకు, ఉత్పత్తులు వాడబోమని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కుమారి ఎన్.శ్రీనిధి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

పొగాకు వాడకానికి దూరంగా ఉండాలి

కొల్లాపూర్ : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. యువత పొగాకు ఉత్పత్తులకు బానిస కావొద్దని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు భూజల భాస్కర్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు కురుమూర్తి, మోహన్‌లాల్, నిరంజన్, బాలస్వామి, రామలక్ష్మయ్య, న్యాయస్థాన సిబ్బంది హాజరయ్యారు.



పొగాకు ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

- కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా ముందస్తుగా గ్రామాల్లో ప్రచారం చేయించాలని తహసీల్దార్లు, డీటీలను కోరారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, చారకొండ, ఊర్కొండ మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూభారతి-2025 ప్రకారం వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అర్జీలు స్వీకరించాలని సూచించారు. భూ సమస్యలున్న రైతులు ఆధార్‌కార్డు, పాత పాస్ బుక్కు, ధరణి పాస్ బుక్కు, రిజిస్టర్ డాక్యుమెంట్ లేదా కోర్టు ఉత్తర్వులు, ఇతర భూమికి సంబంధించిధ్రువపత్రాలు ఏమున్నా తమ దరఖాస్తుతో పాటు జతపర్చి ఇవ్వాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఇబ్రహీం, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు ఉన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు ఘన నివాళి

కొల్లాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం ఆమె చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అహిల్యబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్‌రావు మాట్లాడుతూ పరమ ధార్మికత, ప్రజాసేవపరంగా ఆదర్శంగా నిలిచిన అహల్యాబాయి హోల్కర్ అని అన్నారు. ఆమె ఎన్నో దేవాలయాలను పునర్నిర్మించి హిందూ ధర్మానికి సేవ చేశారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, మహిళా మోర్చా కార్యకర్తలు, నాయకురాలు పాల్గొన్నారు.



అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు

ధ్వజస్తంభం ప్రతిష్ఠకు భూమి పూజ

పెద్దకొత్తపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వకోల్ గ్రామంలో చెన్నకేశవ ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం కొల్లాపూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి రఘుపతిరావు భూమి పూజ చేశారు. 5, 6 తేదీలలో వివిధ పూజా కార్యక్రమాలు, 7వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



కల్వకోల్ చెన్నకేశవస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠకు భూమి పూజ చేస్తున్న జూపల్లి రఘుపతిరావు

కారు గ్యారేజీ దగ్ధం

కల్వకుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఓ కారు గ్యారేజీ ప్రమాదవశాత్తు అగ్నికి దగ్ధమై, అందులోని టైర్లు, వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... కల్వకుర్తి మండలం జీడిపల్లికి చెందిన దండు శివ కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో భవాని కారు గ్యారేజీను ఏర్పాటు చేసుకుని జీవనం పొందుతున్నాడు. శనివారం రాత్రి షాపును మూసి ఇంటికెళ్లాడు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించిన షాపు ఓనరుకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అంతకు ముందే షాపులో ఉన్న కారు టైర్లు, ఆయిల్, టూల్స్, మిగతా వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు పది లక్షల నష్టం జరిగి ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

భర్తపై భార్య ఫిర్యాదు : కేసు నమోదు

బల్మూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జీన్‌కుంట గ్రామానికి చెందిన నమ్రత అనే వివాహిత మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త శ్రీనాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు. నమ్రతకు ఆన్‌లైన్ ద్వారా కర్నాటక రాష్ట్రానికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి పరిచయం కాగా, ఇరువురు మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఉద్యోగం ఉందంటూ నమ్మబలికి చివరకు ఏ ఉద్యోగం లేక మానసికంగా నమ్రతను ఇబ్బంది పెడుతుండడంతో చేసేది లేక తల్లిగారి ఊరైన జీన్‌కుంట గ్రామానికి వచ్చింది. దీంతో శ్రీనాథ్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ఆమెను వేధించడం పట్ల విసుగు చెంది భర్తపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు మహిళలకు రిమాండ్

బల్మూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : భర్తపై కత్తితో దాడి చేసిన ఘటనలో భార్య, ఆమె తల్లిపై కేసు నమోదైన సంఘటన ఇది. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన మల్లయ్యకు బల్మూరు మండలం మహాదేవ్‌పూర్ గ్రామానికి చెందిన దేవమ్మతో మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు గొడవపడుతుంటే దేవమ్మ తల్లి పద్మ ఇద్దరూ కలిసి అల్లుడిపై కత్తితో దాడి చేశారు. దీంతో గాయాలపాలై ఆసుపత్రికి చేరాడు. బాధితుడు మల్లయ్య చెల్లెలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శుక్రవారం దేవమ్మ, పద్మలను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

కల్వకుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఓ యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన కృష్ణవేణి ఈనెల 24న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కృష్ణవేణి మృతికి కారణమైన ముత్యం యాదవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

వంగూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల బతుకులు ఛిద్రమైపోతున్నాయని, ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని టీయూజేఏసీ జిల్లా అధ్యక్షుడు సూగూరు రామచంద్రం డిమాండ్ చేశారు. శనివారం ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, వెంకటయ్య, సాలయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల పట్ల అలసత్వం వహించొద్దు : ఎస్ఐ

తాడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ గురుస్వామి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగర్‌కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్లకు నూతన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు తమ లైసెన్సులను సమయానుకూలంగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేటి నుంచి అమలయ్యే కొత్త ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సహకరించాల్సిందిగా కోరారు.

నిమ్స్‌లో బాధితులకు మాజీ ఎంపీపీ పరామర్శ

పెద్దకొత్తపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కింద పడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మరికల్ గ్రామ వాసి ఎండీ నిరంజన్‌ను శనివారం మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పరామర్శించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన రూ.5 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. అదే విధంగా గుండెపోటుతో అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నక్కలపల్లి గ్రామానికి చెందిన బండి కుర్మయ్యను పరామర్శించినట్లు తెలిపారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొల్లె ఈశ్వర్, హబీబ్, ఇమాన్ గౌడ్, అశు, సలీం, బడేపాశ, నిరంజన్ గౌస్, జహీర్, అశ్రఫ్ పాల్గొన్నారు.

3 నుంచి పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లా కేంద్రంలో ఒక పరీక్ష కేంద్రం : డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జూన్ 3 నుంచి 11 వరకు పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని డీఈవో రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 332 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, జిల్లా కేంద్రంలోనే ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతిలో వివిధ సబ్జెక్టుల ఫలితాల్లో తప్పిన 332 మంది విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి జూన్ 11వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో నిర్వహించనున్నామని డీఈవో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. హాల్ టికెట్లను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకుని విద్యార్థులు పరీక్ష సమయాన్ని కంటే ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, కేవలం 5నిమిషాల ఆలస్య సమయానికి మాత్రమే అనుమతిస్తారని ఆ తర్వాత అనుమతించరని, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవో సూచించారు.

నల్లమలలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనరసింహ



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాల నరసింహ

అచ్చంపేటటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనరసింహ అన్నారు. సీపీఐ అచ్చంపేట నియోజకవర్గ 18వ మహాసభలను శనివారం పట్టణంలో నిర్వహించారు. అంతకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పదించి యువతకు ఉపాధినిచ్చే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉమామహేశ్వర రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు నాయకులతో చర్చలు జరిపి ఆపరేషన్ కగారును నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేశవ్‌గౌడ్, నాయకులు గోపాల్, డాక్టర్ శ్రీను, మల్లేష్, పార్వతమ్మ, పాండు, విష్ణు, బషీర్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

తెలకపల్లి : పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ మండల కార్యదర్శి రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నముద్దునూర్‌లో సీపీఐ మహాసభ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా విష్ణు, సహాయ కార్యదర్శిగా అంజి, కోశాధికారిగా శేఖర్ ఎన్నికయ్యారు.

సీపీఐ మండల కార్యదర్శిగా దార దాసు



ఊర్కొండ : సీపీఐ మండల కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన దార దాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలనరసింహ తెలిపారు. మండలంలో సీపీఐ బలోపేతానికి శాయశక్తులా కృషి చేయాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు దాసు కృతజ్ఞతలు తెలిపారు.

తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలి

- పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : 60 మంది పిల్లల వరకు ఇద్దరు టీచర్లు అని నిబంధనలు విధించడం పూర్తి అసమంజసంగా ఉందని, సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శివరామకృష్ణగౌడ్‌తో కలిసి శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై చివరి నాటికి ఉన్న సంఖ్యఆధారంగా ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని అధికారులను కోరారు. 30వరకు ముగ్గురు టీచర్లు, 30 సంఖ్య దాటితే ఐదుగురు టీచర్లు ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఉండాలన్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఒక ఎస్‌జీటీ పోస్టు హెచ్‌ఎంగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. బడిబాట పూర్తయ్యే నాటికి ఈసారి కచ్చితంగా ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.

317 జీవోను రద్దు చేయాలి : టీఎస్‌యూటీఎఫ్

అచ్చంపేటటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : 317 జీవోను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బాబురావు కోరారు. 317జీవోను రద్దు చేయాలని హైదరాబాద్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునివ్వగా, ధర్నాకు వెళ్లకుండా, స్థానికంగా ఆ సంఘం నాయకులను ముందు స్తుగా పోలీసులు అరెస్టు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ కృష్ణ, శంకర్, దశరథ్, బాలరాం, సైదయ్యలతో పాటు పలువురిని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన 317 జీవోను వెంటనే రద్దు చేయాలని, ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

-ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం



వంగూరు : యోగా ఆసనాలతో అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కల్వకుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ యోగా దినం పురస్కరించుకొని యోగా టీచర్ సునంద వైద్యులు, సిబ్బందికి శిక్ష ణనిచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం మాట్లాడుతూ ప్రతీఒక్కరు యోగాను అలవర్చుకోవాలని, రోజూ చేయడం వల్ల ఎన్నో సత్ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

● వంగూరు : అంతర్జాతీయ యోగా దినంలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిరం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో యోగాపై అవగాహన కల్పించారు. రోజూ యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దేవేందర్, కవిత, బిచ్యానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు చేదోడుగా బీజేపీ ప్రభుత్వం

- పార్టీ మండల అధ్యక్షుడు లోహిత్‌రెడ్డి



తాడూరులో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

తాడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా పంటల మద్దతు ధరకు సంబంధించి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రతీసారిలాగే ఈఏడు అన్ని పంటలకు మద్దతు ధరలు పెంచి, రైతులకు చేదోడుగా నిలుస్తుం దని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తాలో వ్యవసాయ పంటలకు మద్దతు ధరలు పెంచినందుకుగాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పండించిన పంటకు పెట్టుబడి పోను 50శాతం లాభం వచ్చే విధంగా ప్రధానమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకట్, నారాయణ, నాయకులు సుధాకర్, పవన్ కుమార్, లక్ష్మణ్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం

తిమ్మాజిపేట : రైతులు పండించిన పంటల కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం తిమ్మాజిపేటలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు యశ్వంత్, నాయకులు బాల్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రవీణ్, మాజీ ఆర్మీ జవాన్ రాజశేఖర్‌రెడ్డి, రఘుగౌడ్, నిశ్వంత్, రవి, రంజిత్ గౌడ్, బాలస్వామి, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.